క్లుప్తంగా

ఆకట్టుకున్న హరికథా జ్ఞానయజ్ఞం



శ్రీమఠంలో హరి కథ ప్రవచిస్తున్న దృశ్యం

మంత్రాలయం: శ్రీమఠం గురుసార్వభౌమ దాస సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం హరికథ జ్ఞానయజ్ఞం చేపట్టారు. ప్రధాన శిలా మంటప ముంగిట ప్రాంగణంలో హరిదాసులతో హరికథ ప్రవచనం గావించారు. విష్ణువు,లక్ష్మీదేవి, భూదేవి కథారూపక హరికథ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వేలాది మంది భక్తులు హరి కథ ప్రవచనం ఆలకించారు.

వేతనాల పెంపుపై హర్షం

ఆదోనిరూరల్ : వైఎస్సార్ క్రాంతి పథకం సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం 23 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4,569 మంది సిబ్బందికి మేలు జరిగిందని, ఈ మేరకు సిబ్బంది సోమవారం రాత్రి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గృహానికి చేరుకుని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలు, ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరిస్తామని చెప్పారు. ఏపీఎం జనార్దన్, ఎల్‌సీ నరసింహులు, సీసీలు రవికుమార్, తిక్కన్న, నల్లన్న, రామన్న, నాగలక్ష్మి, సౌజన్య, అకౌంటెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కు అందజేత

మండలంలోని బసరకోడు గ్రామానికి చెందిన పెద్దరెడ్డికి కొన్ని నెలల క్రితం తలలో రక్త స్రావం జరిగి పక్షవాతానికి గురయ్యాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. విషయాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, సర్పంచ్ రామకోటిరెడ్డి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి కింద రూ.2 లక్షలు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం బాధితా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చెక్కును అందించారు.

ఉరుకుందలో దోపిడీని అరికట్టాలి



సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోనిరూరల్ : శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఉరుకుంద ఈరన్నస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు అమ్మే టెంకాయల అమ్మకాల్లో నిలువు దోపిడీని అరికట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్ కోరారు. సోమవారం ఈ మేరకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నాగరాజుగౌడ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఒక టెంకాయ రూ.20 విక్రయించాల్సి ఉండగా, రూ.50కు విక్రయించి భక్తులను నిలువునా దోపిడీ చేస్తున్నారన్నారు. తలనీలాల విషయంలో కళ్యాణ కట్ట వద్ద భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తలనీలాలను తీసే వారు రూ.వంద వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, న్యాయవాది లోకేష్‌కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, పట్టణాధ్యక్షుడు మహాదేవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉరుకుందుగౌడ్, మండల ఉపాధ్యక్షుడు ముకేష్ పాల్గొన్నారు.

బల్లేకల్‌లో జాతీయజెండా ఊరేగింపు

ఆదోనిరూరల్ : ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం మండలంలోని బల్లేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద మీటర్ల జాతీయ జెండాను ఊరేగించారు. పతాకాన్ని హిందీ ఉపాధ్యాయిని వాసవీ అందజేశారు.ర్యాలీలో హెచ్‌ఎం బి.సత్యన్న, ఉపాధ్యాయులు వాసవీ, బందేనవాజ్, కేశవరెడ్డి, చంద్రశేకర్, కాశీవిశ్వనాథ్, మల్లయ్య, జయరాం, జహిరాబీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగలించిన బైక్‌కు చలానా

కోసిగి: కౌతాళం మండలం ఉప్పర హాల్ గ్రామానికి చెందిన కురువ మహాదేవ అలియాస్ ఈరన్న అనే వ్యక్తికి చెందిన (ఏపీ21ఎఎక్స్1049) నంబర్ గల బైక్ గతేడాది ఆగస్టు 23న చోరీకి గురైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.అయితే ఆ బైక్‌కు గతేడాది అక్టోబర్ 18న కోసిగి పోలీసులు ఆర్‌సీ లేదని రూ.135 జరిమానా విధించారు. చోరీ చేసిన వ్యక్తి నుంచే ఫెనాల్టీ రాబట్టారని బాధితుడు వాపోయాడు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గతేడాది బైక్‌ను రైల్వే స్టేష ఆవరణలో ఉంచి రాయచూర్‌కు వెళ్లి రాత్రి తిరిగి వచ్చి చూస్తే బైక్ కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే నేటి వరకు పట్టించుకోకపోగా.. అదే బైక్‌కు జరిమానా విధించి స్వాధీనం చేసుకోకపోవడం దారుణమన్నాడు. ఈ విషయంపై ఎస్‌ఐ సతీష్ కుమార్‌ను వివరణ కోరగా.. తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని, బైక్ దొంగతనం విషయం తనకు తెలియదని సమాధానమిచ్చారు.



ప్రధాన ముఖద్వారం వద్ద ఏర్పాట్లు



సిద్ధంగా ఉన్న నీళ్ల ట్యాంకులు

ఉత్సవాలకు ఏర్పాట్లు షురూ

కౌతాళం: ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణమాస ఉత్సవాల నేపథ్యంలో ఆలయం, పరిసరాల్లో ఏర్పాట్లు జోరందుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో పలు రకాల పనులు చేపట్టారు. ముఖద్వారం వద్ద ప్రత్యేక గోపురాలు ఏర్పాటు చేస్తున్నామని అలాగే క్యూలైన్ల వద్ద ముందు భాగంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు బారికేడ్లతో క్యూలైన్‌ను పెంచుతున్నట్లు తెలిపారు. భక్తుల విడిది కోసం కూడ షెడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గోపురం ముందు భాగంలోని క్యూలైన్‌లో షామియాలను ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్, దేవాలయ ఆవరణలో గుంతలను గ్రావెల్‌తో పూడ్చి వేశామని, ప్రత్యేక దర్శనాల కోసం క్యూ లైన్‌లు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇక భక్తులకు ఇబ్బందులు లేకుండా మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేశామన్నారు.



క్యూలైన్లలలో షామియాల ఏర్పాటు



భక్తుల విడిది కోసం షెడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



అదనపు క్యూలైన్‌పై షెడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

విద్యుత్ తీగ తెగి పడి మహిళ మృతి



మృతిచెందిన అయ్యమ్మ (ఫైల్)

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని ఎల్‌బీ స్ట్రీట్‌లో సోమవారం ఉదయం ఇంటి బయట అయ్యమ్మ (74) అనే మహిళ కూర్చొని ఉండగా, ఉన్న ఫలంగా విద్యుత్ తీగ తెగి పడటంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లిగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు పేర్కొన్నారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, కోతులు వచ్చినప్పుడు తెగిపడుతున్నాయని, వాటిని మార్చాలని కాలనీ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రాణం కోల్పోవాల్సి వచ్చిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు. ఒక కుమార్తె మృతిచెందగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం చేయకపోవడంతో కుమార్తెలు ఆస్పత్రి నుంచి నేరుగా ఇంటికి తీసుకొచ్చారు.



అయ్యమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యే పరామర్శ..

ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బాధితా కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా మరమ్మతులు చేసి ఉంటే ఇలాంటి ఘోరం జరిగి ఉండేదికాదని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తంపై మండిపడ్డారు. ఇలాంటివి పునరావృత్తంగాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బలపంపై జాతీయ జెండా



విద్యార్థి గోవర్ధన్

ఆదోనిరూరల్ : మండలంలోని కమ్మరచేడు జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ డ్రాయింగ్ టీచర్ మల్లికార్జున బలపంపై భారతదేశ చిత్రపటాన్ని, మధ్యలో జాతీయ జెండాను అద్భుతంగా చిత్రీకరించాడు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు. మల్లికార్జున గతంలో అంబేద్కర్, మహాత్మా గాంధీ, దేవుళ్ల ప్రతిమను చాక్‌పీస్, గులక రాళ్లపై చిత్రీకరించి మన్ననలు అందుకున్నాడు. అలాగే.. అలసందగుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి గోవర్ధన్ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెన్సిల్ ముక్కపై అతి చిన్న జాతీయ జెండాను మలిచి అబ్బురపరిచాడు. విద్యార్థి ప్రతిభను చూసి హెచ్‌ఎం గిరిజాదేవి ప్రశంసించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు యస్.కీర ప్రత్యేక శిక్షణతో ఈ ఆకృతిని వేసినట్లు విద్యార్థి తెలిపాడు.





బలపంపై భారతదేశ చిత్రం, జాతీయ జెండా దృశ్యాలు, పెన్సిల్ ముక్కపై చెక్కిన జాతీయ జెండా

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

మంత్రాలయం : అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలంలోని కంబదహాల్, దొడ్డిమేకల, గంగులపాడు గ్రామాల్లో నా భూమి - నా దేశం కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల పాఠశాలల ఆవరణలో అమరవీరుల శిలాఫలకాలను ఆవిష్కరించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచులు దస్తగిరి, చంద్రశేఖర్, నాయకులు గజేంద్రరెడ్డి, ఈరన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ రామన్న పాల్గొన్నారు.



అమరవీరుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

జాతీయ జెండాల పంపిణీ

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని భీమాస్ సర్కిల్ వద్ద బీజేపీ రాష్ట్ర నాయకులు విట్టా రమేష్ వంద జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిపై స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా ఎగరవేయాలని సూచించారు.

డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం

ఆదోనిఅర్బన్ : అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటికి వచ్చి తన భార్యను దుర్భాషలాడి అవమానించాడని, పలుమార్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని భాస్కర్‌రెడ్డి కాలనీకి చెందిన సునీల్ సోమవారం డీఎస్పీ కార్యాలయం ఎదుట కత్తితో ఛాతిపై గీసుకుంటూ ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే పోలీసులు సునీల్‌ను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీల్ విలేకరులతో మాట్లాడూతూ.. క్రాంతినగర్‌కు చెందిన చిన్నా అనే వ్యక్తి సునిల్‌కు రూ.18వేలు అప్పుగా ఇచ్చాడు. పలుమార్లు తన సొమ్ము ఇవ్వాలని కోరినా పట్టించుకోకపోవడంతో ఇంటికెళ్లి సునిల్ భార్య లక్ష్మితో గొడవపడ్డాడు. ఈ విషయంపై టూటౌన్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, సోమవారం కూడా ఇంటికి వచ్చి తన భార్యతో గొడవపడి దుర్భాషలాడాడని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోకపోవడంతో డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆత్యహత్యకు యత్నించినట్లు చెప్పాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసనాయక్‌ను వివరణ కోరగా.. ఇంతకు ముందు కేసు నమోదు చేసేందుకు యత్నించగా తాము రాజీ అయ్యామని సునిల్, చిన్నా చెప్పారు. అయితే కాలనీలో సునిల్ గురించి విచారించగా.. అప్పు చెల్లించ లేక ఇలా చేస్తుంటాడని తేలిందని, భార్యతో కేసు పెట్టిస్తే అప్పు ఇచ్చిన వారికి డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదనే ఇలా చేస్తున్నాడని సీఐ తెలిపారు.



ఆస్పత్రిలో వివరాలు చెబుతున్న సునీల్

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం వంటి చేపట్టి ఫల,పుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవెద్యం సమర్పించి పూజలు చేశారు.



స్వామికి పూజల నిర్వహిస్తున్న అర్చకులు

తప్పని పోటీ..

కౌతాళం: మండలంలో బదినేహాల్ సర్పంచ్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా సోమవారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యింది. వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం మద్దతుదారులు పోటీలో ఉన్నారు. మాల పెద్ద నర్సప్ప వైఎస్సార్‌సీపీ తరపున పోటిలో ఉండగా ఈయనకు మంచం గుర్తు కేటాయించారు. టీడీపీ మద్దతుదారుడు వీరేష్‌కు కత్తెర గుర్తు కేటాయించారు. రౌడూరు 6వ వార్డు మెంబరుకు చాకలి లింగమ్మకు కుక్కర్ గుర్తు, వీరేష్‌కు గొను గుర్తు కేటాయించారు. కుంబళనూరులోని 3వ వార్డుకు లక్ష్మి, కౌతాళంలోని 12వ వార్డుకు బోయ ఉరుకుందమ్మ, గోతులదొడ్డి పంచాయతీలోని 8వ వార్డుకు పూజారి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మట్టి సేకరణకు టెండర్లు

కర్నూలు (న్యూసిటీ) : రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి మట్టి సేకరించడానికి జిల్లా మైనింగ్ శాఖ టెండర్లు పిలిచింది. ఆదోనిలోని సర్వే నంబర్ 149లో 1.5 హెక్టార్ల భూమిని 15 సంవత్సరాలకు లీజ్ ఇవ్వడానికి ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ వరకు టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆసక్తి గల వారు టెండర్లలో పాల్గొన్నాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారం

కోసిగి: మండలంలోని ఐరన్‌గల్లు గ్రామంలో తాగునీటి బోరుకు కొత్త మోటార్ ఏర్పాటు చేశామని, దీంతో నీటి సమస్య పరిష్కారమైందని సర్పంచ్ రామాంజనేయులు తెలిపారు. సోమవారం సర్పంచ్ మోటార్ అమర్చి నీటిని సరఫరా చేయించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆదోనిటౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 42వ వార్డు హనుమాన్‌నగర్‌లో కౌన్సిలర్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపను సందర్శించి పాలన తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేళాపాల లేకుండా తాగునీటి సరఫరా చేస్తున్నారని కొందరు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే ఉన్న వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, కౌన్సిలర్లు చలపతి, సురేష్, ఫయాజ్, లక్ష్మన్న, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, కామాక్షి తిమ్మప్ప, వైస్ చైర్మన్ గౌస్, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, శ్రీలక్ష్మి, నాయకులు నాగరాజు, రామలింగేశ్వరయాదవ్, ఆర్టీసీ రహమాన్ పాల్గొన్నారు.



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

కిరాణా దుకాణంలో చోరీ

కోసిగి: స్థానిక ఊరువాకిలి పక్కనున్న నాగరాజుకు చెందిన కిరాణా దుకాణంలో సోమవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రోజు వారిలాగే ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన నాగరాజు.. తలుపునకు వేసి తాళాలు పగిలి పండడం చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు. తలుపు తెరిచి చూస్తే అందులో ఉన్న రూ. 10వేల నగదు, రూ.20వేలు విలువ చేసే వస్తువులు దొంగలించారని బాధితుడు పేర్కొన్నాడు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ఆదోని సెంట్రల్: ఆదోని–ఇస్వి ఆర్‌ఎస్ ఎస్‌ల మధ్య కిలోమీటరు నంబర్ 502/12–14 వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారీ పడి మృతిచెందాడు. మృతుడి వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, నీలిరంగు చొక్కా,బూడిదరంగు ప్యాంటు ధరించాడని రైల్వే ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. మృతుని వద్ద గుంటూరు నుంచి తెనాలి, తెనాలి నుంచి తిరుపతి రైల్వే టికెట్ ఉందని పేర్కొన్నారు. గుర్తు పట్టి ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



మృతి చెందిన గుర్తుతెలియన వ్యక్తి

చిరుతల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోసిగి: చిరుత పట్ల కొండ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని ఆదోని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి సూచించారు. సోమవారం సాయంత్రం కోసిగి తిమ్మప్ప, బసవన్న కొండ పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కొంత కాలంగా కోసిగి పరిసర ప్రాంతాల్లో చిరుతలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. అయితే చిరుతలు ఒకే చోట స్థిరంగా ఉండవని, అవి ప్రజలకు ఎలాంటి హాని కల్గించవు, వాటిని చూసి భయాందోళన చెంది వాటికి హాని కలిగించరాదని చెప్పారు. బీట్ ఆఫీసర్ అనురాధ, సిబ్బంది ఉన్నారు.

సర్వే పకడ్బందీగా చేయాలి

ఆదోనిటౌన్ : ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సోమవారం హనుమాన్‌నగర్, భీరప్పనగర్, కిలిచినపేట, మైదర్‌గేరి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు, బూత్ లెవెల్ ఆఫీసర్లు చేస్తున్న సర్వే తీరుపై ఆరా తీశారు. చనిపోయిన వారి పేర్లను తొలగించడం, 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్త నమోదు చేసుకోవడం, ఓటర్ల సందేహాలను నివృతిచేయడం వంటివి చేయాలని సూచించారు.

అర్జీలకు వెంటనే పరిష్కారం చూపండి

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలకు అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన దుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులు అర్జీలను వారంలోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందసింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, డిప్యూటీ తహసీల్దార్‌లు కౌసర్‌భాను పాల్గొన్నారు.

అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని..

- గ్రామంలో షెడ్యూల్ కులాలకు శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని సాదాపురం గ్రామస్తులు అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం నాగలాపురం గ్రామానికి చెందిన వడ్డే మారెప్ప మా ఇంటి సమీపంలో మాకు తెలియకుండా విద్యుత్ పోల్ నిర్మించి మాపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ అందజేశాడు.